

క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుంది

● కలెక్టర్ పమేలా సత్పతి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 7: క్రీడలతో శారీరక శక్తి, మానసికోల్లాసం కలుగుతాయని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వసతి గృహాల విద్యార్థుల క్రీడా పోటీలను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానిషిలో క్రీడా స్ఫూర్తి పెంపొందిస్తుందని, నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను తేలికగా అధిగమించగలమన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఆటలో పాల్గొని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ మాట్లాడుతూ క్రీడాకారులకు ఎన్నో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయన్నారు. అనతరం క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి అనిల్‌ప్రకాశ్, డీడీ నతానియోల్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కీర్తిరాజవీరు, ఎస్సీ కార్పోరేషన్ అధికారి నాగార్జున పాల్గొన్నారు.

● పారదర్శకంగా ఈవీఎంల నిర్వహణ

కరీంనగర్ టౌన్: జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంల మొదటిస్థాయి తనిఖీ ఇంజనీర్ల ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహిస్తామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఎఫ్ఎల్‌సీ, వెబ్ కాస్టింగ్, ఈవీఎంలు, వెబ్ కాస్టింగ్ గదులను బుధవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో కె మహేశ్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గేట్లు తెరిచేదెప్పుడు?

● ఎదురు చూస్తున్న బీఆర్ఎస్ నేతలు
● పార్టీ మారేందుకు సిద్ధమైన పలువురు కార్పొరేటర్లు
● ప్రతిబంధకంగా మారిన భూకబ్జా ఆరోపణలు

(ఆంధ్రజ్యోతిప్రతినిధి, కరీంనగర్)

అధికార పార్టీ ఓకే అంటూ సంకేతాలివ్వడమే ఆలస్యం.. బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురు నేతలు సిద్ధంగా ఉన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సంప్రదింపులు జరిపిన పలువురు బీఆర్ఎస్ నేతలు ఆయన నుంచి సానుకూల సంకేతాలు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో ఆడింది ఆటగా పాడింది పాటగా అధికారం చలాయించిన పలువురు నేతలు ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జాలు చేశారని విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు ఆ స్థలాలే వారి అధికారవాంఛకు, అధికార పార్టీలో చేరాలనే కాంక్షకు అడ్డుతగులుతున్నాయి.

● కేసులతో ఉక్కిరిబిక్కిరి

పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి భూకబ్జాలపై ప్రత్యేక దృష్టిసారించి పేద, మధ్య తరగతి ప్రజల భూములను అక్రమంగా ఆక్రమించుకున్న కేసులను విచారిస్తూ అరెస్టుల పర్వానికి శ్రీకారం చుట్టారు. దీంతో కబ్జాదారులైన నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పటికే ఇద్దరు కార్పొరేటర్లు, ఒక మాజీ ఆర్టీఏ సభ్యుడు, ఒక మాజీ ఎంపీటీసీ, మరో బీఆర్ఎస్ నాయకుడు భూకబ్జా కేసుల్లో అరెస్టయ్యారు. పదుల సంఖ్యలో నేతలపై ఫిర్యాదులు రావడంతో విచారణ జరుగుతున్నది. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రధానంగా ఈ కబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిలో ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోగానే వారంతా కాంగ్రెస్‌లో చేరాలని ప్రయత్నాలు ప్రారంభించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిపి తమ చేరికకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సిందిగా కోరారు. పలువురు బీఆర్ఎస్ నేతలు కూడా ఇదే మార్గంలో ఉన్నారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్‌నాయక్, చింతకుంట ఎంపీటీసీ శారద, ఎలగందుల ఎంపీటీసీ రమేశ్‌గౌడ్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు.

● వేచి చూసే ధోరణిలో మంత్రి 'పొన్నం'

కార్పొరేటర్ల చేరికకు భూకబ్జాలు ప్రతిబంధకంగా మారాయని తెలుస్తున్నది. కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకున్న తర్వాత వారిని కబ్జా కేసుల్లో పోలీసులు అరెస్టు చేస్తే పార్టీ ప్రతిష్ట దిగజారిపోతుందని భావిస్తున్న పొన్నం ప్రభాకర్ వారి చేరికకు ఆమోదం చెప్పకుండా వేచిచూసే ధోరణిని అవలంబిస్తున్నారని తెలిసింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 13 మంది కార్పొరేటర్లు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఆ పార్టీ గేట్లు తెరవడమే ఆలస్యం.. పార్టీ మారేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వీరి చేరిక తర్వాత పరిస్థితులన్నీ సజావుగా ఉంటే చేరాలనే ఉద్దేశంతో మరో ఏడుగురు సిద్ధమయ్యారని ప్రచారం జరుగుతున్నది. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో గతంలో ఉన్న పరిచయాలతో సన్నిహితంగా ఉండే కొందరు కార్పొరేటర్లు ఆయనను కలిసి కాంగ్రెస్‌లో చేరే విషయమై చర్చించారని సమాచారం. ఆ తర్వాత ఒకటిరెండు రోజులకే అందులో ఒకరిపై కబ్జా ఆరోపణలు వచ్చాయి. పోలీసులు విచారణ ప్రారం భించడంతో వారెప్పుడు అరెస్టు అయ్యేది తెలవకుండా పోయింది. ఇప్పటికే అరెస్టు అయిన బీఆర్ఎస్ కార్పొరేటర్ల విషయంలో చర్యలను అడ్డుకునేందుకు ఆ పార్టీ అగ్రనేతలు



ప్రయత్నించినా అవి ఫలితవివ్వలేదని తెలిసింది. మంత్రిని కలిసిన కార్పొ రేటర్లపై వచ్చిన కబ్జా ఆరోపణల విషయంలో కూడా చేసిన ప్రయత్నా లను పోలీసులు పట్టించుకోక పోవడంతో వారి అరెస్టు కూడా త్వరలోనే ఉండబో తుందని ప్రచారం జరుగుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ కార్పొ రేటర్లను కాంగ్రెస్‌లో చేర్చుకుంటే ఆ తర్వాత వారు అరెస్టు అయితే పార్టీకి చెడ్డపేరు వస్తుందనే కారణంతో మంత్రి పొన్నం ప్రభాకర్ చేరికల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారని సమాచారం. కాంగ్రెస్ గేట్లు తీస్తే పార్లమెంట్ ఎన్నికలకు ముందే పలువురు బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీని వీడడం ఖాయమని ప్రచారం జరుగుతోంది.

దేశవ్యాప్తంగా మోదీ గాలి వీస్తోంది..

● వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్నప్పుడు ఎప్పుడైనా ప్రజలను కలిశారా..?
● నాకు ఈటలతో సహా ఎవరితోనూ విభేదాలు లేవు...
● ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



రంగాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ

హుజూరాబాద్/హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 7: దేశవ్యాప్తంగా మోదీ గాలి వీస్తోందని, దేశానికి రక్ష ప్రధానమంత్రి నరేంద్రమోదీనేనని ప్రజలు భావిస్తున్నారని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ మండలం రంగాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా మోదీకి ఓటు వేయాలని మనసులో అనుకుంటున్నారన్నారు. కరీంనగర్ ఎంపీగా ఉన్నప్పుడు వినోద్‌కుమార్ ఎప్పుడైనా ప్రజలను కలిశారా.. అని ప్రశ్నించారు. వినోద్‌కుమార్ డబ్బులు సంపాదించుకోవడం, కేసీఆర్ కుటుంబానికి దోచిపెట్టడం కోసమే పని చేశారన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తే వినోద్‌కుమార్ ఎందుకు నోరు విప్పలేదన్నారు. కరీంనగర్- వరంగల్, ఎల్కతుర్తి-సిద్దిపేట హైవే నిధులు ఎవరు తెచ్చారో ప్రజలకు తెలుసన్నారు. వినోద్‌కుమార్ స్వయం ప్రకటిత మేధావి అని, ఆయన మేధావితనం కరీంనగర్ ప్రజలకు ఏమైనా ఉపయోగపడిందా అని ప్రశ్నించారు. తనకు సొంత వ్యాపారాలు లేవని, 24 గంటలు ప్రజల కోసమే పని చేస్తున్నానన్నారు. తనకు ఈటలతో సహా పార్టీలో ఎవరితోనూ విభేదాలు లేవని, అందరం కలిసి కట్టుగా పని చేస్తున్నామన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు రేషన్ కార్డును ప్రమాణికంగా తీసుకుంటున్నారని, పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. కొత్త ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే యుద్ధ ప్రతిపాదికన వారం రోజుల్లో కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ఈ నెలలోనే విడుదలయ్యే అవకాశం ఉందని, ఆలోపే ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలన్నారు. కొందరు నేతలు హద్దులు మీరి అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని, ఇది మంచిది కాదన్నారు. ముఖ్యమంత్రి పదవికి గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సీఎంను చెప్పుతో కొడతానని బీఆర్ఎస్ నేతలు మాట్లాడడం కరెక్టు కాదని. ఆ పార్టీ అహంకార పూరిత వైఖరికి ఇది నిదర్శనమన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను ఫాంహౌస్ నుంచి బయటకు రప్పించింది తానేనన్నారు. రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉంటుందని తెలిపారు. ఉద్యోగులను రాచి రంపాన పెట్టేలా ఉన్న 317 జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, గౌతమ్‌రెడ్డి, బింగి కరుణాకర్, సంపత్‌రావు, కుమార్, గంగిశెట్టి రాజు, రాముల కుమార్ పాల్గొన్నారు.

ప్రోత్సాహక నిధులు వచ్చేదెప్పుడు?

ఆయిల్ పామ్ రైతుల ఎదురుచూపులు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 7: ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి 4,200 రూపాయల చొప్పున నిర్వహణ ఖర్చులు అందించింది. నిర్వహణ ఖర్చులు ప్రభుత్వం ఇస్తుండడం, అంతర పంటలు సాగు చేసుకునే వెసులుబాటు ఉండడంతో ఆయిల్ పామ్ సాగుకు రైతులు ఆసక్తి కనబరిచారు. గత ఏడాదికి సంబంధించిన ప్రోత్సాహక నిధులు జూన్, జూలై నెలలోనే రావాల్సి ఉన్నాయి. అవి ఇప్పటి వరకు రైతులకు అందలేదు. యాసంగి సీజన్‌లో డివిజన్ ఉద్యానవన శాఖాదికారుల లెక్కల ప్రకారం ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం హుజూరాబాద్ మండలంలో 77.23, జమ్మికుంటలో 186, వీణవంకలో 140, శంకరపట్నం 78, సైదాపూర్‌లో 169 ఎకరాలుగా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నారు. హుజూరాబాద్ మండలంలో 77 ఎకరాలకు సంబంధించి 3 ,23,400 రూపాయల ప్రోత్సాహక నిధులు రావాల్సి ఉంది. శాసన సభ ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిన నిర్వహణ నిధులు నేటికి విడుదల కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది యాసంగి సీజన్‌లో రైతులను ఎంపిక చేసి వారికి ఆయిల్ పామ్ మొక్కలు పంపిణీ చేశారు. వీటికి నాలుగేళ్ల వరకు ఎలాంటి ఆదాయం వచ్చే అవకాశం లేకపోవడంతో అంతర పంటల సాగుకు ఎకరాకు 2,100, తోట నిర్వహణ కింద మరో 2,100 రూపాయల చొప్పున విడుదల చేయాలి. నేటికి ఎలాంటి ప్రోత్సాహం నిధులు మంజూరు కాకపోవడంతో రైతులు నిధుల విడుదల కోసం ఎదురు చూస్తున్నారు. దీనికి తోడు ఆయిల్ ఫామ్ సాగు నిర్వహణ ఖర్చులు చూసి రైతులు బెంబెలెత్తిపోతున్నారు.



ఇప్పలనర్సింగాపూర్ గ్రామంలో సాగవుతున్న ఆయిల్ పామ్‌ను పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నాం...

-గూడురి మల్లారెడ్డి, రైతు, ఇప్పలనర్సింగాపూర్.



నాకున్న వ్యవసాయ భూమిలో ఆయిల్‌పామ్ సాగు చేశాను. మొదటి విడత కింద ఎకరానికి 4200 రూపాయల చొప్పున ఖాతాలో జమ చేశారు. గతేడాదికి సంబంధించిన మొత్తం రాలేదు. అంతర పంటతో ఆదాయం వస్తున్నా.. ఆయిల్‌పామ్ మొక్కల నిర్వహణకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి ప్రోత్సాహక నిధులు మంజూరు చేయాలి.

ప్రోత్సాహక నిధులను పెంచాలి...

- స్వామిరెడ్డి, రైతు, ఇప్పలనర్సింగాపూర్



ఆయిల్ ఫామ్ సాగు నిర్వహణ ఖర్చులు అధికంగా ఉన్నాయి. మొక్కల సంరక్షణ కత్తిమీద సాములా మారింది. ఎలుకల భారి నుంచి మొక్కలను కాపాడాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఆయిల్ పామ్ సాగు చేపట్టిన రైతులకు ప్రోత్సాహక నిధులను పెంచేలా ప్రభుత్వం దృష్టి సారించాలి.

చుక్కలనంటిన ధరలు

● జాతర వస్తువులకు పెరిగిన ధరలు ● జోరందుకున్న మొక్కులు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 7: సమ్మక్క, సారలమ్మ జాతర ఈ నెల 21 నుంచి 24 వరకు జరగనుంది. ఈ జాతరకు వినియోగించే వస్తువులకు ఇప్పుడే రెక్కలొచ్చాయి. అమ్మవార్లకు సమర్పించే మొక్కుల్లో బంగారం (బెల్లం) ప్రధాన వస్తువు. బెల్లంతోపాటు నైవేద్యాలు, పూజా సామాగ్రి



ధరలు చుక్కలను చూ పుతున్నాయి. మార్కెట్‌లో ఎక్కడ చూసినా కొనుగోళ్లతో సందడి నెలకొంటున్నది. జాతర సమీపిస్తున్న కొద్దీ వస్తువుల రేట్లు మరింత పెరిగే అవకాశం ఉంది. 15 రోజుల నుంచే మొదటి (మేడారం)తోపాటు ఇతర ప్రాంతాలలో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి. సమ్మక్క జాతరకు ముందు వేములవాడ, కొండగట్టు, ఓదెల, కొమురవెల్లి, కొత్తకొండ, ధర్మపురి, కోటి లింగాల, కాళేశ్వరం వంటి ప్రాంతాలకు భక్తులు తరలివెళ్తున్నారు. బెల్లం కిలోకు 50, కొబ్బరికాయ 25 రూపాయల వరకు ధర పలుకుతున్నాయి. ప్యాలాల ప్యాకెట్ 30, పుట్నాలు కిలోకు వంద రూపాయల వరకు అమ్ముతున్నారు. పూలు, పసుపు,



కుంకుమలు, సారె వస్తువుల రేట్లు భారీగా పెరిగాయి. రకరకాల పండ్లు కిలోకు వంద రూపాయల పైచిలుకే పలుకుతున్నాయి. దేశీ కోళ్లు, మేకలు, గొర్రెల ధరలు భారీగా పెరిగాయి. వీటి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. వివిధ ప్రాంతాల్లో జరిగే జాతరకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం కోసం వాహనాల రేట్లు కూడా పెంచుతున్నారు. ధరలను గమనించిన చాలామంది భక్తులు ముందస్తుగానే అన్ని వస్తువులను కొని సిద్ధం చేసుకొని భద్రపర్చుకుంటున్నట్లు తెలుస్తోంది.

అల్పాహారం కొందరికేనా?

కొన్ని పాఠశాలలకే పథకం పరిమితం


తిమ్మాపూర్, ఫిబ్రవరి 7: ప్రభుత్వ పాఠశాలలో హజరు శాతం పెంచేందుకు విద్యార్థులకు మద్యాహ్న భోజనంతోపాటు అల్పాహారం అందించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ముందుగా ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో ప్రభుత్వ పాఠశాలలో ఈ అల్పాహారం కార్యక్రమం ప్రారంభించింది. దశల వారీగా అన్ని పాఠశాలలకు విస్తరించాలనుకున్నారు. తిమ్మాపూర్ మండలవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల్లో 2,206 మంది విద్యార్థులు చదు వుకుంటున్నారు. ఇందులో రేణికుంట, నుస్తులాపూర్, నల్లగొండ, కుర్మపల్లి, మొగిళిపాలెం, సుభాష్ నగర్, గుండ్లచెరువుపల్లి, తిమ్మాపూర్ లోని ప్రాథమిక పాఠశాలల్లోని 216 మంది విద్యార్థులకు మాత్రమే అల్పాహారం అందజేస్తున్నారు.



తిమ్మాపూర్‌లోని పలు పాఠశాలల్లో అల్పాహారం తింటున్న విద్యార్థులు

పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ ఇస్తాం

- శ్రీనివాస్ రెడ్డి, ఎంఈవో



పాఠశాలల్లో అల్పాహారం పథకం కొన్ని పాఠశాలల్లోనే అమలవుతోంది. ఆ పాఠశాలకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వానికి పంపించాం. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉప్మా, పోహలాంటి స్నాక్స్ విద్యార్థులకు ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నాం.

● పెండింగ్‌లో బిల్లులు

అల్పాహారం అందించే బాధ్యతను ప్రభుత్వం మధ్యాహ్న భోజన నిర్వాహకులకే అప్పజెప్పింది. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకానికే నెల వారీగా బిల్లులు రావడం లేదని, అల్పాహారానికి డబ్బులు ఎక్కడి నుంచి తేవాలని నిర్వహకులు వాపోతున్నారు. ఈ పథకంపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయలేదు. బిల్లులు సరిగా రాకపోవడంతో పూర్తి స్థాయి మెనూ అమలు కావడం లేదు.

● పరీక్షల సమయంతో విద్యార్థులకు ఇబ్బందులు

పదో తరగతి పరీక్షలు సమీపించాయి. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ఎక్కువ సమయ ఉండాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమయంలో అల్పాహారం అందజేస్తే ఉపయోగకరంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. పదో విద్యార్థులకు మాత్రం స్నాక్స్ ఇచ్చేందుకు ప్రస్తుతం కలెక్టర్ చొరవ చూపడంతో అధికారులు వాటికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి విద్యార్థులందరికి అల్పాహారం అందించే విధంగా చూడాలని పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇళ్ల పేరుతో పేదలకు కుచ్చుటోపీ

● రూ.కోటిన్నరకు పైగా వసూలు ● ఏడుగురిపై కేసు.. ఇద్దరి అరెస్టు

ముస్తాబాద్, ఫిబ్రవరి 7: పేదలకు ఇళ్లు కట్టిస్తామన్న ఓ స్వచ్ఛంద సంస్థ వారికి కుచ్చుటోపీ పెట్టింది. ముస్తాబాద్ మండలం మోయినికుంట, మద్దికుంట, మొర్రాయిపల్లె గ్రామాల్లో సిటిజన్స్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ అనే స్వచ్ఛంద సంస్థ డబల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని వసూళ్లకు పాల్పడింది. ఐదేళ్ల క్రితం మూడు గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థ తరఫున ఇళ్లు కట్టించేందుకు లబ్ధిదారుడు వాటా చెల్లించాలని పేర్కొంది. దీంతో మూడు గ్రామాల్లోని పేదలు రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు అప్పు చేసి ప్రతినిధుల చేతిలో పెట్టారు. గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పేదల నుంచి డబ్బులు తీసుకొని ఒప్పందం చేసుకున్నారు. 2020సంవత్సరంలో జరిగిన ఒప్పందంలో లబ్ధిదారుడి వాటా రూ.3.50 లక్షలు చెల్లించాలని, మరో ఆరున్నర లక్షలు సంస్థ ద్వారా చెల్లించేందుకు అంగీకరించారు. కొంత మంది లబ్ధిదారులకు సంస్థ రాయి, సిమెంట్ స్టీలు పంపించి బెస్‌మెంట్ వరకు పనులు చేపట్టారు. రోజులు గడుస్తున్న పనులు పూర్తి కాకపోవడంతో సంస్థ ప్రతినిధులను సంప్రదించగా స్పందించలేదు.

మూడు గ్రామాల్లో దాదాపు వంద మందికి పైగా లబ్ధిదారులు రూ. కోటిన్నర చెల్లించినట్లు భావిస్తున్నారు. మద్దికుంట, మొర్రాయిపల్లె, మోయినకుంట గ్రామాల్లో కొంతమందికి చెల్లిం చిన డబ్బుల మట్టుకు ఇంటి నిర్మాణ ముడి సరుకు అందినట్లు తెలిపారు.

ఠాణాను ఆశ్రయించిన బాధితులు

డబ్బులు చెల్లించచినా పనులు మొదలు పెట్టకపోవడంతో ఆందోళన చెందిన లబ్ధిదారులు కొంత మంది పోలీసులను ఆశ్రయించారు. 2022లోనే మోయినికుంట, మద్దికుంట, మొర్రాయిపల్లెకు చెందిన బాధితులు ముస్తాబాద్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు సంస్థ ప్రతినిధులు కె వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరెడ్డి, మరో నలుగురిపై సోమవారం కేసు నమోదు చేశారు. అదేరోజు శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరాజును రిమాండ్‌కు తరలించారు. మూడు గ్రామాల్లో ఇళ్లు నిర్మిస్తామని స్వచ్ఛంద సంస్థ పేదల వద్ద భారీ వసూళ్లకు పాల్పడి మోఖం చాటేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న కారు

● ఇద్దరి మృతి..

ఒకరి పరిస్థితి విషమం

శంకరపట్నం, ఫిబ్రవరి 7: శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామంలో కరీంనగర్-వరంగల్ హైవేపై బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కరీంనగర్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న కారు కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న హనుమకొండకు చెందిన తాళ్లపల్లి కొంరమ్మ(68), కరీంనగర్‌కు చెందిన నీర్ల ప్రభాకర్ (58)లు అక్కడికక్కడే మృతి చెందారు. తాళ్లపల్లి సదానందం, తాళ్లపల్లి గీతలకు తీవ్ర గాయాలయ్యాయి. గీత పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడు ప్రభాకర్ భార్య సబిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆగి ఉన్న టిప్పర్‌కు పార్కింగ్ లైట్లు వేయక పోవడంతోనే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

రూ.6,650 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 7: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,650 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 82మంది రైతులు 758క్వింటాళ్ల విడి పత్తి, 13మంది రైతులు 19క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,650, కనిష్ఠ ధర రూ.5,500 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 7:దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరికి ఎనిమిది నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ పెద్దపల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని బసంత్‌నగర్ ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత ఏడాది సెప్టెంబర్ ఒకటిన పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ శివారులో గల హనుమాన్ దేవాలయంలో హుండీ పగలకొట్టి అందులో గల ఇరవై వేల రూపాయల నగదు దొంగిలించారు. దర్యాప్తులో హన్మకొండకు చెందిన పాశం ప్రణీత్, ఉమర్ ఫరూక్ చోరీకి పాల్పడినట్లు తేలింది. అప్పటి ఎస్‌ఐ గంగరాజు గౌడ్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులకు ఎనిమిది నెలల కఠిన కారాగార శిక్ష విధించారు. కేసును ప్రస్తుత బసంత్‌నగర్ ఎస్‌ఐ వెంకటేశ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాకేష్ ఆధ్వర్యంలో కోర్టు పీసీ సంజయ్ కేసును ట్రయల్ నడిపించారు.

ఆచంపల్లి గ్రానైట్ ఫ్యాక్టరీలో చోరీకి యత్నం

గంగాధర, ఫిబ్రవరి 7: గ్రానైట్ ఫాక్టరీలో బుధవారం వేకువ జామున ఆరుగురు గుర్తు తెలియని మహిళలు చోరీకి యత్నించారు. గంగాధర మండలం ఆచంపల్లిలోని గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలో వేకువ జామున సిబ్బంది నిద్రిస్తున్న సమయంలో కొందరు మహిళలు చోరీకి ప్రయత్నించారు. గ్రానైట్ కటింగ్ మిషన్‌కు నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన 10 హెచ్‌పీ మోటర్ల విద్యుత్ తీగలను కత్తిరించారు. ఇదే సమయంలో శబ్దం రావడంతో ఫ్యాక్టరీ సిబ్బంది కేకలు వేశారు. సుమారు ఆరుగురు మహిళలు ఆటోలో పారిపోతుండగా ఫ్యాక్టరీ సిబ్బంది ద్విచక్రవాహనాలపై వెంబడించి కొత్తపల్లి మండలం నాగుల మల్యాల వద్ద వారిని పట్టుకున్నారు. మహిళలు మానకొండూరు మండలానికి చెందిన వారిగా తెలిసింది. సిబ్బంది అప్రమత్తతతో గ్రానైట్ ఫ్యాక్టరీ పెద్ద మోటర్లను కాపాడగలిగారు. దీనిపై ఎస్‌ఐ అభిలాష్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

డబ్బులు ఇవ్వాలని బెదిరించిన వ్యక్తి రిమాండ్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: సిరిసిల్ల పట్టణం చంద్రంపేటకు చెందిన రమణారెడ్డిని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ ఉదయ్‌రెడ్డి బుధవారం తెలిపారు. రమణారెడ్డి భూ తగాదాల్లో మధ్యవర్తిత్వం చేస్తూ డబ్బులు, భూమి డిమాండ్ చేసేవాడని పేర్కొన్నారు. చంద్రంపేటకు చెందిన రాజు అనే వ్యక్తిపై హత్యాప్రయత్నం చేసిన సంఘటనతో పాటు అతడిపై మరో నాలుగు కేసులు నమోదయ్యాయని తెలిపారు. దర్యాప్తులో భాగంగా రమణారెడ్డి కోసం గాలిస్తుండగా కోర్టులో లొంగిపోయాడని, మెజిస్ట్రేట్ రిమాండ్‌కు తరలించారని పేర్కొన్నారు. తన భూ సమస్య పరిష్కారానికి రమణారెడ్డిని సంప్రదించగా సెటిల్‌మెంట్ చేస్తానని చెప్పి రూ.3లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా రూ.1లక్ష అడ్వాన్సుగా తీసుకొని భూసమస్య పరిష్కారం చేయలేదని, అయినప్పటికీ మిగితా రూ. 2లక్షలు ఇవ్వాలని ఒత్తిడిచేశాడని లేదంటే 100గజాల స్థలం రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరించడమే కాకుండా ఈ నెల 5న వేములవాడకు వెలుతుండగా తనపై హత్యాప్రయత్నం చేశాడని బాధితుడు చంద్రంపేటకు చెందిన తుంగ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

రాయికల్, ఫిబ్రవరి 7: రాయికల్ పట్టణానికి చెందిన దాసరి చిన్న నర్సయ్య (70) జ్ఞాపకశక్తి కోల్పోయి ఈ నెల 4న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం మధ్యాహ్నం చిన్ననర్సయ్య మృతదేహం రాయికల్ గ్రామ శివారులోని జన్నయి చెరువులో లభ్యమైంది. చిన్న నర్సయ్య మతిస్థిమితం సరిగా లేక ప్రమాదవశాత్తు నీటిలో పడి చనిపోయాడని అతని భార్య దాసరి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

రాజన్న వసతి గదుల బుకింగ్ కంప్యూటరీకరణ

వేములవాడ, ఫిబ్రవరి 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం వసతి గదులను ఆలయ అధికారులు కంప్యూటరీకరించారు. ఇప్పటి వరకు ఆలయ వసతి గదుల కేటాయింపును ఉద్యోగులు మ్యానువల్‌గా చేసే వారు. ఇకపై కంప్యూటర్ ద్వారా వసతి గదులను కేటాయించడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. వసతి గదుల కేటాయింపు విషయంలో ఆలయ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్న తరుణంలో రాష్ట్రంలోని ఇతర ఆలయాల తరహాలో వసతి గదుల కేటాయింపును కంప్యూటర్ ద్వారా చేసేందుకు నిర్ణయించడంతో సామాన్య భక్తులకు సైతం గదులు సులభంగా లభించే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. వసతి గది కోసం వచ్చే యాత్రికుడు తప్పనిసరిగా విచారణ కార్యాలయానికి వచ్చి ఫొటో గుర్తింపు కార్డుతో పాటు స్వామి వారి అద్దె గదిలో ఉండే వారి వివరాలను వెల్లడిస్తే కంప్యూటర్‌లో నమోదు చేసి గది అద్దె మొత్తం, అడ్వాన్సు చెల్లించిన తర్వాత గది కేటాయిస్తారు. 24 గంటల్లో వసతి గది ఖాళీ చేయని యాత్రికుడికి సంబంధించి అడ్వాన్స్ మొత్తాన్ని తదుపరి అద్దె కింద జప్తు చేస్తారు. వసతి గదుల కంప్యూటరీకరణ ద్వారా ఆలయంలోని ఏఏ వసతి సముదాయంలో ఎన్ని గదులు ఖాళీ ఉన్నాయని వాటిపైన సైతం సంబంధిత సిబ్బందికి స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. ఇదిలా ఉండగా భీమేశ్వర సదన్, పార్వతిపురం వసతి సముదాయాలకు అదనపు కౌంటర్‌ను ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆలయ అధికారులు తెలిపారు. టి యాప్ ద్వారా ముందస్తు బుకింగ్ సౌకర్యం.. రాజన్న సన్నిధికి వచ్చే భక్తులు వసతి గదులను ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకునేందుకు టి యాప్ పోలియో యాప్, మీసేవ పోర్టల్ అవకాశం కల్పించారు. వసతి గదుల బుకింగ్‌తో పాటు శ్రీస్వామి వారి ఆర్జిత సేవలకు సంబంధించిన పూజల టికెట్లను ముందస్తుగా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా రాజన్న ఆలయ వసతి గది బుక్ చేసుకోవాలనుకునేవారు కనీసం వారం రోజులు ముందుగా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రస్తుతం నందీశ్వర వసతి గదుల సముదాయంలో 112 నాన్ ఏసీ గదులు, 55 ఏసీ గదులు, 8 సూట్లు ఉండగా, లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో 98 నాన్ ఏసీ గదులు, పార్వతీపురంలో 110 నాన్ ఎసి గదులు, భీమేశ్వర సదన్ 56 ఏసీ గదులు, 4 సూట్లు, 4 గెస్ట్ హౌస్‌లు, అమ్మవారి కాంప్లెక్స్‌లో 4 ఏసీ గదులు అందుబాటులో ఉన్నాయి.



వేములవాడలో వసతి గదుల విచారణ కార్యాలయం

రాజన్న హుండీ ఆదాయం రెండు కోట్ల 15 లక్షలు

వేములవాడ, ఫిబ్రవరి 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా రెండు కోట్ల పదిహేను లక్షలకు పైచిలుకు ఆదాయం సమకూరింది. గత 14 రోజుల వ్యవధిలో భక్తులు శ్రీ స్వామివారి హుండీలలో సమర్పించిన కానుకలను ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా 2 కోట్ల 15 లక్షల 67 వేల 130 రూపాయల నగదు, 71 గ్రాముల 500 మిల్లి గ్రాముల బంగారం, 13 కిలోల 600 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ తెలిపారు.

వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 7: కరీంనగర్‌లో వాణిజ్య పన్నులశాఖ కార్యాలయ భవన నిర్మాణానికి 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని అధికారులు, ఉద్యోగులు కోరారు. బుధవారం ఉమ్మడి జిల్లా వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సిహెచ్.రవికుమార్, తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. ముజాహిద్‌హుస్సేన్, కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు గుంటి భిక్షపతి ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

కోతుల దాడిలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో బుధవారం కోతులు దాడిలో అదే గ్రామానికి చెందిన వృద్ధుడు అలివేలి నారాయణ తీవ్ర గాయాలపాలయ్యాడు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నారాయణ తన ఇంటి నుంచి బస్టాండు వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా నాలుగు వానరాలు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచాయి. పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. కాగా గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇళ్లలోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గ్రామంలో కోతుల బెడదను నివారించాలని కోరుతున్నారు.

మేడారం జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఆర్ఎం

భగత్‌నగర్, ఫిబ్రవరి 7: సమ్మక్క సారలమ్మ మేడారం జాతరకు కరీంనగర్ బస్టాండ్‌లో బస్సుల పాయింట్ల ఏర్పాట్లను బుధవారం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎస్ సుచరిత పరిశీలించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణానికి అవకాశం ఉన్నందున మేడారం జాతరకు భక్తులతాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగు నీరు, ఇతర మౌళిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. కరీంనగర్-1, 2డిపోల్లో ఇతర డిపోల నుంచి వచ్చే ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను పరిశీలించారు. ప్రయాణికులకు చల్లని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని బస్‌స్టేషన్ మేనేజర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ రీజినల్ మేనేర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, డిప్యూటీ ఆర్ఎం మెకానికల్ కె సత్యనారాయణ, డిపో మేనేజర్లు ఎల్‌మల్లేశం, విమల్లయ్య, రజనీకృష్ణ, వీరస్వామి, నజీర్ ఉన్నారు.


బస్టాండ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం సుచరిత

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: సిరిసిల్ల పట్టణంలోని సిద్దార్థనగర్‌లో రాగుల స్రవంతి అలియాస్ లాస్య(30) అనే వివాహిత అదనపు వరకట్న వేధింపులకు బలైంది. భర్త, అత్తలు అదనంగా రూ.10 లక్షలు వరకట్నం ఇవ్వాలని గత కొంతకాలంగా వేధిస్తుండటంతో ఆత్మహత్యకు పాల్పడింది. సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన స్రవంతిని ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన రాగుల నాగరాజుతో ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో రూ.20 లక్షల వరకట్నం, ఇతర లాంచనాలు ఇచ్చారు. వీరికి అయిదేళ్ల కూతురు, రెండేళ్ల బాబు ఉన్నారు. స్రవంతి బీటెక్ పూర్తిచేయగా భర్త నాగరాజు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సర్దాపూర్ 17బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరు సిద్ధార్థనగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం స్రవంతి వాంతులు చేసుకోవడంతో అనుమానం వచ్చిన భర్త స్థానిక ఆస్పత్రికి చికిత్స కోసం తరలించాడు. పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో హైద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా రాత్రి మృతిచెందింది. భర్త నాగరాజు అదనంగా రూ. 10లక్షల వరకట్నం తీసుకురావాలని వేధించడంతో పాటు బాబు పుట్టేంత వరకు అబార్షన్ చేయించాడని, తల్లిదండ్రుల మాటలు వింటూ భార్యను హింసించేవాడని దీనితోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్రవంతి పురుగుల మందు తాగి ఉంటుందని పోలీసులు భావి స్తున్నారు. ఈ సంఘటనపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసి మృతదేహానికి పంచనామా అనంతరం పోస్టు మార్టం కోసం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. కాగా తల్లి మృతితో ఇద్దరు చిన్నారులు విలపించడం విషాదం నింపింది.


స్రవంతి (ఫైల్)

భర్తపై కేసు నమోదు

స్రవంతి మృతి కేసులో కానిస్టేబుల్ అయిన భర్త నాగరాజు, అతని తల్లిపై 304బి సెక్షన్ కింద కేసు నమోదు చేశామని టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. ఈ కేసులో నాగరాజును అరెస్ట్ చేశామని గురువారం రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో దొంగల చేతివాటం

● జేబులు కట్ చేసి నగదు, ఫోన్లు అపహరణ

ధర్మపురి, ఫిబ్రవరి 7: ధర్మపురి పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరైన కొందరు నాయకుల జేబులు కట్ చేసి నగదు, మొబైల్ ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అపహరించారు. సమావేశం ముగిసిన తరువాత కార్యకర్తలు భోజనం చేసేందుకు వెళ్లే సమయంలో ఫంక్షన్ హాల్ రద్దీగా మారింది. ఆ సమయంలోనే జేబులు కత్తిరించి పర్సులు, మొబైల్ ఫోన్లు అపహరించారు. పాక వెంకటేషం వద్ద నుంచి రూ.12,000, కోఆప్షన్ మెంబర్ ఎండీ అలీ మొబైల్ ఫోన్, బొల్లె భగత్ కుమార్ వద్ద రూ.4,000, రాచకొండ ఆనంద్ వద్ద రూ 5,500, కాశెట్టి వీరేశం నుంచి రూ. 18,000, మరి కొందరు వ్యక్తుల నగదు, మొబైల్ ఫోన్లు అపహరించారు. ఫంక్షన్ హాల్ సీసీ కెమెరాల ఆధారంగా చోరీలకు పాల్పడ్డ వ్యక్తులను పట్టుకోవాలని కోరుతున్నారు.

మాజీ నక్సలైట్‌పై పీడీ యాక్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: వేములవాడ పట్టణం తిప్పాపూర్‌కు చెందిన మాజీ నక్సలైట్ మానుక కుంటయ్య(45)పై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్‌ల ఆదేశాల మేరకు పీడీయాక్ట్ అమలు చేస్తూ ఆ ఉత్తర్వులను అందజేసి బుధవారం చర్లపల్లి జైలుకు తరలించినట్లు టౌన్ సిఐ కరుణాకర్ తెలిపారు. తిప్పాపూర్‌కు చెందిన కుంటయ్య గతంలో జనశక్తి అనే తీవ్రవాద గ్రూపులో పనిచేసి ఆ తర్వాత లొంగిపోయి భూ సమస్యలపై జోక్యం చేసుకుంటూ యజమానులను బెదిరిస్తూ వారి నుంచి డబ్బు వసూలు చేసేవాడని తెలిపారు. మానుక కుంటయ్య నేర కార్యకలాపాలను నిరోధించడానికి జిల్లా పరిధిలో భూ సంబంధించిన విషయాల్లో 8 కేసులలో నిందితునిగా ఉన్నప్పటికీ తన కార్యకలాపాలను మార్చుకోనప్పటికీ కుంటయ్యపై వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచినట్లు తెలిపారు. అయినప్పటికీ అతను నేర కార్యకలాపాలను కొనసాగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండటంతో కుంటయ్యపై పీడీ యాక్ట్ అమలు చేశారని, ఇట్టి ఉత్తర్వులను అందజేసి చర్లపల్లి జైలుకు తరలించామని ఆయన తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బోడ సాయికుమార్ పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్యకు యత్నించాడని స్థానికులు తెలిపారు. గ్రామంలోని సాయికుమార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. బుధవారం ఉదయం తన స్నేహితులతో కలిసి విందు చేసుకున్నారని చెప్పారు. అనంతరం తాను పురుగుల మందు తాగుతున్నానని పేర్కొంటూ సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసి మిత్రులకు వాట్సప్‌లో పోస్టు చేశాడని పేర్కొన్నారు. గ్రామ శివారులోకి చేరుకున్న స్నేహితులు సాయికుమార్‌ను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని తెలిపారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నిర్ధారించారని పేర్కొన్నారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియడం లేదని చెప్పారు. ఈ విషయంపై ఎస్‌ఐ రమాకాంత్‌ను వివరణగా తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో ఏడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: బాలికను కిడ్నాప్ చేసి అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో వేములవాడ పట్టణానికి చెందిన ఎర్రం సాయి కిరణ్‌కు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత బుధవారం తీర్పు ఇచ్చినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. అక్టోబరు 7,2016న ఓ బాలికను సాయికిరణ్ కిడ్నాప్ చేసి అసభ్యంగా ప్రవర్తించడంతో ఫోక్సో కేసు నమోదైనట్లు సీఐ తెలిపారు.

బొగ్గు రంగ సంస్థలను నాశనం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

● 16న జరిగే సమ్మెను విజయవంతం చేయండి ● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

గోదావరిఖని, ఫిబ్రవరి 7: బొగ్గు రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆరోపించారు. బుధవారం గోదావరిఖని చౌరస్తాలోని శ్రామిక భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహజ సంపద అయిన బొగ్గు బ్లాకులను కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అమ్మకానికి పెట్టిందని, అందులో భాగంగానే సింగరేణిలోని నాలుగు బొగ్గు బ్లాకులను ఈ వేలం ద్వారా గుత్తేదార్లకు అమ్మడం కోసం ప్రయత్నాలు సాగిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారమైన సింగరేణిని కాపాడడం కోసం ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలోని 160బొగ్గు బ్లాకులను అంబానీ, అదానీలకు అమ్ముతున్నారని, ప్రభుత్వరంగ ఆస్తులను కాపాడుకోకపోతే దేశంలోని పేదరికాన్ని నిర్మూలించలేమన్నారు. పదేళ్ల కాలంలో దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని నరేంద్ర మోదీ అమ్మకానికి పెట్టి అందులో పని చేస్తున్న కార్మికులను రోడ్డున పడవేశారని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పకపోతే రానున్న రోజుల్లో దేశం సర్వనాశనం అవుతుందని, దీన్ని ప్రజలు, కార్మికులు, కర్షకులు గుర్తుంచుకొని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి, ఎర్రవెల్లి ముత్యం, ఉల్లి మొగిలి, ప్రవీణ్‌కుమార్, వెంకన్న, రాజేశం, శ్రీహరి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

సూక్ష్మ కళాకారుడికి మూడు ప్రపంచ రికార్డులు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలోని తులసీనగర్‌కు చెందిన డాక్టర్ గుర్రం దయాకర్ అనే సూక్ష్మ కళాకారుడు తన ప్రతిభను చాటుతున్నాడు. మూడు ప్రపంచ రికార్డులు పొంది జగిత్యాల పేరును కీర్తికెక్కించాడు. అయోధ్య రామ మందిర ప్రతిష్ఠ పర్వదినాన్ని పురస్కరించుకుని అద్భుతమైన రామమందిర సూక్ష్మ కళారూపాన్ని తయారుచేసి అబ్బురపరిచాడు. 60 గంటల పాటు కష్టపడి 60 వేలకు పైగా బియ్యపు గింజలు ఉపయోగించి తయారు చేసిన విగ్రహానికి మూడు ప్రపంచ రికార్డులు దక్కాయి. భారత్ వరల్డ్ రికార్డ్స్, టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, యూనివర్శల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు దయాకర్ ప్రతిభను గుర్తించారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో మూడు ప్రపంచ రికార్డులకు సంబంధించిన సర్టిఫికెట్లను ప్రముఖ సినీ నటుడు బాబూమోహన్ చేతుల మీదుగా అందజేశారు.


ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న దయాకర్

15న జేఎల్ఎం సర్టిఫికెట్ల వెరిఫికేషన్

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 7 : ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 15న గురువారం జేఎల్ఎం 5వ విడత జాబితా నియామకం కొరకు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, పోలు ఎక్కించే పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. ఈ పరీక్షలు నియామక కమిటీ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరి జాబితాను వారి చిరునామాకు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపనున్నట్లు తెలిపారు. ఎవరికైనా లెటర్ ముట్టకపోతే ఎస్ఈ కార్యాలయంలో వారి ఐడీ కార్డు చూపించి కాల్ లెటర్లు పొందవచ్చని తెలిపారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 7: ఉమ్మడి జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 10న నిర్వహించనున్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం 10 నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు హ్యాండ్‌బాల్ సంఘం సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్‌లకు మైదానంలో రిపోర్టు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94419 25807 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 21 వరకు అవకాశం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 7: ఉమ్మడి జిల్లాలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలు పొందిన విద్యార్థులు పది, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసేందుకు ఈ నెల 12 నుంచి 21లోగా పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ప్రతి సబ్జెక్టుకు 100, ఇంటర్మీడియట్ విద్యార్థులు రూ.150, ప్రాక్టికల్స్‌కు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఒక్కో సబ్జెక్టుకు 25 రూపాయల అపరాధ రుసుముతో ఈ నెల 27వ తేదీ వరకు, రూ.50 తో మార్చి 4వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు.

పోలీసు కస్టడీకి భూకబ్జా నిందితులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 7: నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి అక్రమంగా భూకబ్జాలకు పాల్పడిన కేసులో వారం రోజుల నుంచి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న తీగల గుట్టపల్లి మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్య, గుంజ లక్ష్మణ్‌లను బుధవారం కరీంనగర్ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నకిలీ ధ్రువ పత్రాలు, నకిలీ స్టాంపులతో ఆరెపల్లి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో కొమ్ము భూమయ్య, గుంజ లక్ష్మయ్యను ఈ నెల 1న పోలీసులు అరెస్టు చేసి జైలు తరలించారు. జైలులో రిమాండ్‌లో ఉన్న ఇద్దరిని మరింత లోతుగా విచారించేందుకు రెండు రోజుల కిందట పోలీసులు కరీంనగర్ కోర్టులో కస్టడీ పిటిషన్ వేయగా ఒక రోజు కస్టడీకి అనుమతి లభించింది. ఈ మేరకు భూమయ్య, గుంజ లక్ష్మన్‌లను ఉదయం 10 గంటలకు కస్టడీకి తీసుకుని మొదట విచారణ అనంతరం తీగలగుట్టపల్లిలోని ఇద్దరి ఇళ్లలో సోదాలు జరిపారు. ఈ సోదాల్లో అక్రమ భూకబ్జాలకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లు, నకిలీ స్టాంపులు, నకిలీ ధ్రువపత్రాలు లభించినట్లు తెలిసింది. ఈ డాక్యుమెంట్లను భూమయ్య ముందుంచి మరింత సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. నకిలీ స్టాంపులు, ధ్రువపత్రాల తయారీకి సహకరించిన వారి వివరాలతోపాటు ఎవరెవరి భూములు కబ్జాచేసింది, కబ్జాకు ప్రయత్నించిన వివరాలను రాబట్టినట్లు సమాచారం. భూమయ్య తీగలగుట్టపల్లి ప్రాంతంలో కూడా పలువురి ఇళ్ల స్థలాలను కబ్జా చేశాడని ఆరోపణలు వచ్చాయి.

● భూకబ్జా, బెదిరింపులు, దౌర్జన్యానికి సంబంధించిన ఐదు కేసుల్లో జనవరి 24న అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న సీతారాంపూర్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను పోలీసులు బుధవారం రెండోసారి కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. అరెస్టు అయిన సాగర్‌పై ఇప్పటికే రౌడీషీట్ తెరిచారు. ఫిబ్రవరి 1న మొదటిసారి కస్టడీ తీసుకుని విచారించారు.

కబ్జా స్థలాలు బాధితులకు అప్పగింతపై విచారణ

కిసాన్‌నగర్‌లో ఒక నాయకుడు తన వద్దకు భూ వివాదం పరిష్కరించాలని వచ్చిన పలువురి స్థలాలను కబ్జా చేశాడని 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన కథనంపై కరీంనగర్ స్పెషల్ బ్రాంచి పోలీసులు రంగంలోకి దిగి విచారణ జరుపుతున్నారు. ఆ నాయకుడు ఎవరు? బాధితులు ఎవరనేది విచారణ జరుపుతున్నారు. పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లకుండా భూములు కబ్జా చేసిన వ్యక్తి బాధితులతో మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. 8 మంది బాధితుల్లో నలుగురు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

నేడు షబ్ ఏ మేరాజ్

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 7: నమాజ్‌ల విశిష్టతను వివరించే షబ్ ఏ మేరాజ్‌ను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. రాత్రంతా జాగరణ పాటిస్తూ మజీదుల్లో, ఇళ్లలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. దాన ధర్మాలాచరిస్తారు. ఈ సందర్భంగా మజీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఐదు కిలోల కణతిని తొలగించిన 'కెల్విన్' వైద్యులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలోని కెల్విన్ ఆసుపత్రి వైద్యులు మహిళ కడుపులోంచి 5 కిలోల కంతిని తొలగించారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం గంగారాం తండాకు చెందిన 24 సంవత్సరాల మహిళ కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండడంతో బంధువుల ద్వారా కెల్విన్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించారు. వైద్యులు డాక్టర్ దొంతు ప్రశాంత్, డాక్టర్ చింత సురేష్‌కుమార్, డాక్టర్ గౌతమ్, డాక్టర్ త్రివిక్రమ్ ఆమెకు పలు వైద్య పరీక్షల నిర్వహించగా, ఆమె అండాశయంలో 5 కిలోల కంతి ఉన్నట్లు గుర్తించారు. బుధవారం ఆమెకు ఆపరేషన్ నిర్వహించి 5కిలోల కంతిని బయటకు తీశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.

సెయింట్ జార్జ్ విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న సెయింట్‌జార్జ్ చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 7: సెయింట్ జార్జ్ (సిబిఎస్ఈ) విద్యార్థి జె శ్రీచరణ్‌ను రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొన్నందుకు ఎన్‌సీసీ కల్నల్ డేనియల్‌లాట్టిమ్ అభినందించారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డితో పాటు, కేర్ టేకర్ రజితను 9వటి బెటాలియన్ ఎన్‌సీసీ కల్నల్ డెనియల్, ఏవో రాకేష్‌జేశ్వాల్, ఎస్ఎం సాగర్‌సింగ్‌లు అభినందించారు.

కరాటేలో అచీవర్స్ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో అచీవర్స్ విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 7: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ ఆక్టివ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈనెల 3,4వ తేదీల్లో కరీంనగర్‌లో జరిగిన ఇండో నేపాల్ ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్లో అత్యధిక పతకాలు సాధించారు. ఇందులో మణిదీప్ కటావిభాగంలో రజత పతకం, శివ శ్రేయాస్ కటా విభాగంలో బంగారు పతకము,స్నేహిత కటా కటావిభాగంలో రజత పతకము, అభిరామ్ కటాలో రజత పతకం శ్రీదక్ష కటాలో బంగారు పతకం, శ్రీ వాస్తవ కటావిభాగంలో రజత పతకము, లలితాక్షరి కటావిభాగంలో రజత పతకం, ప్రసన్న కటావిభాగంలో రజత పతకం, కే. సాయి తేజ కమిటీ, కటాలో రెండు బంగారు పతకాలు, రేవంత్ కటావిభాగంలో రజత పతకం నశ్రీక్ సాయి కటావిభాగంలో వెండి పతకం, శివ కార్తీక్ కటాలో వెండి పతకం, మనస్విని కటాలో కుమిటిలో రెండు బంగారు పతకాలు, శ్రీ సహస్ర రెడ్డి కటాలో రజత పతకం, కుమిటీలో వెండి పతకము, అక్షయ్ కటా లో రజత పతకం, కుమిటీలో రజత పతకం, శ్రీ వర్షిత్ రెడి, కటా, కుమిటీలో రెండు రజత పతకాలు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ సి.హెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సి.హెచ్ పల్లవి, కరాటే రాష్ట్ర చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సురభి వేణుగోపాల్, కరాటే ఇన్‌స్ట్రక్టర్ వినేష్ అభినందించారు.

సఖి కేంద్రం సమస్యలను పరిష్కరిస్తాం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 7: నగరంలోని సఖి కేంద్రంలో ఏమైనా సమస్యలుంటే వాటిని తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. బుధవారం నగరంలోని 14వ డివిజన్ సప్తగిరికాలనీలోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు చెందిన సఖి కేంద్రాన్ని ఆయన సందర్శించారు. సఖి కేంద్రం హెల్ప్‌లైన్ నెంబర్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దిండిగాల మహేశ్, చాడగొండ బుచ్చిరెడ్డి, గుగ్గిళ్ళ జయశ్రీశ్రీనివాస్ పాల్గొన్నారు.

బాపూజీ చేనేత పరిశ్రమను పరిశీలించిన ఎంపీ



రంగాపూర్‌లో చేనేతను పరిశీలిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 7: మండలంలోని రంగాపూర్ గ్రామంలో బుధవారం గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా బాపూజీ చేనేత పారిశ్రామికుల సహకార సంఘం భవనం, నర్సరీని ఎంపీ బండి సంజయ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత పరిశ్రమలు ఎలా నడుస్తున్నా యని ఎంపీ బండి సంజయ్ అడిగి తెలుసుకున్నారు. చేనేత పరిశ్రమలతో చాలా మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. చేనేత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

దళితబంధు లబ్ధిదారులను పరామర్శించిన ఎమ్మెల్యే

వీణవంక ఫిబ్రవరి 7:మండల కేంద్రానికి చెందిన గాజుల అమల ఇటీవల దళితబంధు రెండో విడత మంజూరు కాలేదని ఆత్మయత్నానికి పాల్పడగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. నియోజకవర్గంలో 18 వేల కుటుంబాలకు దళితబంధు మంజూరు కాగా 14 వేల కుటుంబాలకు పది లక్షలు మంజూరు అయ్యాయని మిగతా నాలుగు వేల కుటుంబాల అకౌంట్‌లో డబ్బులు ఉన్నా ఫ్రీజ్ చేశారని అన్నారు. వెంటనే విడుదల చేయాలన్నారు. ఇటీవల మృతి చెందిన గెల్లు అశోక్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈయన వెంట వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలి

రామడుగు, ఫిబ్రవరి 7: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుంచి ఈ నెల 14 వరకు పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టిందని ఇందులో అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ కలిగేటి కవిత అన్నారు. మండలంలోని కొరటపల్లి గ్రామంలో జరిగిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతర నిర్వహణపై సమీక్ష

శంకరపట్నం, ఫిబ్రవరి 7: మండలంలోని కేశవపట్నం గ్రామంలో ఈ నెల 21నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణ, ఏర్పాట్లపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులు, జాతర నిర్వహణ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. తహసీల్దార్ అనుపమ మాట్లాడుతూ జాతర సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

సైదాపూర్ : సైదాపూర్-జాగీర్‌పల్లి గ్రామాల మధ్యలోని ఊరగుట్టపై జరిగే శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర పనులను బుధవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు.

కేజీబీవి పాఠశాలకు అద్దె భవనాల పరిశీలన

గన్నేరువరం, ఫిబ్రవరి 7, మండలానికి మంజూరైన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నిర్వహణకు మండల కేంద్రంలో తాత్కాలికంగా అద్దె భవనాలను బుధవారం ఎంపిపి లింగాల మల్లారెడ్డితో కలిసి అధికారులు పరిశీలిచారు. తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

షీటీంకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలి



మాట్లాడుతున్న మహిళా ఠాణా సీఐ శ్రీలత, పాల్గొన్న విద్యార్థినులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 7: మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలని షీటీం ఇంచార్జి, మహిళా ఠాణా సీఐ శ్రీలత పిలుపునిచ్చారు. కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం షీటీం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ శ్రీలత మాట్లాడుతూ షీటీం పోలీసుల ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో, రద్దీగా ఉండే ప్రదేశాలు, బస్టాండ్‌లలో షీటీం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేధింపులకు గురైనవారు 100 లేదా షీటీం వాట్సప్ నెంబరు 8712670759కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ ఏఎస్ఐ విజయమని పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 7: సైబర్ క్రైంపై ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కరీంనగర్ సైబర్‌క్రైం పోలీసులు అవగాహన సదస్సును నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఓటీపీల సహాయంతో డబ్బులను కొల్లగొడుతున్న విధానాన్ని వివరించారు. అపరిచిత వ్యక్తుల వద్ద నుంచి ఫోన్‌కాల్ వచ్చిన సందర్భంలో ఏ విధంగా సురక్షితంగా ఉండాలి, ఫోన్ హాకింగ్, పార్ట్‌టైం జాబ్ పేరిట మోసాలు జరుగుతున్న తీరుపై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ సునీల్, ఎస్ఐ జోస్న, సిబ్బంది వసీం అక్రం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఇద్దరు ఎంపీటీసీల రాజీనామా

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి7: బీఆర్ఎస్‌కు ఇద్దరు ఎంపీటీసీలు గుడ్‌బై చెప్పారు. కొత్తపల్లి మండలం ఎలగందల్ ఎంపిటీసీ సభ్యుడు మందరమేష్, చింతకుంట ఎంపిటీసీ సభ్యురాలు పట్టెం శారదలక్ష్మీనారాయణలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్‌తో పాటు, జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావుకు రాజీనామా పత్రాలను పంపించారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 7: విద్య, ఉద్యోగ రంగాలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్ల కోసం బిల్లును ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం క్యాబినెట్ లో ప్రత్యేక బీసీ మంత్రి శాఖను ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి పటేల్, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ వద్ద ఢిల్లీలో భారీ ధర్నా చేపట్టారు. కార్యక్ర మంలో పెంట అజయ్ పటేల్, ఎర్ర శ్రీహరి గౌడ్, సత్యం, వినయ్ బాబు, నరసింహులు, నాగుల మహేష్, ఉపేందర్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకం కోసం వివరాలు అందించాలి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి7: గృహ జ్యోతి పథకం అమలు కోసం ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తుల వివరాలు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరును రీడింగ్‌కు వచ్చే విద్యుత్తు సిబ్బందికి ఇచ్చినచో మీ వివరాలను నమోదు చేస్తారని ఎస్ఈ గంగాధర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్కాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దండి

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 7: కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. బుధవారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 వరకు నిర్వహించనున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో వీరబుచ్చయ్య పాల్గొన్నారు.

యువత క్రమశిక్షణతో మెలగాలి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి7: యువత క్రమశిక్షణతో మెలగాలని ఎస్‌యూ డైరెక్టర్ ఆఫ్ యూజీసీ సెల్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ మనోహర్ విద్యార్థులకు సూచించారు. బుధవారం వాగేశ్వరి డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ఆధ్వర్యంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు వెల్కమ్ పార్టీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కరెస్పాండెంట్ బీవీ ఆర్ గోపాల్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రత్న గోపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ సతీష్, డాక్టర్ వెంకరెడ్డి, లింగమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, రమణ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నిజాముద్దీన్, వేదవ్యాస రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన డీఆర్‌డీఏ పీడీ

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి7: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించుకుండా రోడ్డు నిర్మిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు డీఆర్‌డీఏ పీడీ శ్రీలత బుధవారం పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దావకమలమనోహర్, ప్రత్యేకాధికారి రంజిత్ కుమార్, ఈజిఎస్ పీవో స్పందన పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారు'



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 7: కొందరు బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ ఆరోపించారు. బుధవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్ల హరీష్‌రావు, కవిత, కేటీఆర్, బాల్క సుమన్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. కృష్ణా జలాలపై చర్చకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాలు విసిరితే ముందుకురాని బీఆర్ఎస్ నాయకులు ఇష్టానుసారంగా తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకుల ఆటవిక చర్యలను అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో బోయినిపల్లి చంద్రయ్య, చిగిరి శ్రీధర్, బాపురెడ్డి, రామ్మూర్తి, కిషన్, గజ్జల రవి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 7: మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతిమ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్, చల్మెడ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ వారి సహకారంతో కరీంనగర్ టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం ముగిసింది. కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ సతీమణి డాక్టర్ బోయినపల్లి మాధవి గారి పర్యవేక్షణలో నాలుగు రోజుల పాటు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బోయినపల్లి మాధవి గారు మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు నిర్వహించిన మహిళలకు క్యాన్సర్ అవగాహన, క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన వచ్చిందని పేర్కొన్నారు. పరీక్షలు చేయించుకున్న వారికి ఈనెల నిర్ధారణ పరీక్షల ఫలితాలకు సంబంధించిన పత్రాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతిమ, చల్మెడ వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఆకారపు భాస్కర్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరుతున్న భాస్కర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి7: కరీంనగర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన ఆకారపు భాస్కర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్‌లో ఏఐసీసీ సెక్రెటరీ, రాష్ట్ర ఇంచార్జి రోహిత్ చౌదరి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షులు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌లు ఆకారపు భాస్కర్‌రెడ్డి, ఇతర నాయ కులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భాస్కర్ రెడ్డితో పాటు అనుచరులు 100 మంది కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కార్యక్రమంలో కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధికారప్రతినిధి మేనేని రోహిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని సందర్శించిన అదనపు కలెక్టర్



హుజూరాబాద్‌లో స్ట్రీట్ వెండింగ్ జోన్ స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

హుజూరాబాద్, ఫిబ్రవరి 7: హుజూరాబాద్ మున్సిపాలిటీ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయం చుట్టూ వీధి వ్యాపారుల కోరకు స్ట్రీట్ వెండింగ్ జోన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. మున్సిపాలిటీ పన్నుల వసూళ్ల సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆస్తి, నల్లా, ట్రేడ్ లైసెన్స్‌లు, అడ్వటైజ్‌మెంట్ ఫీజులు వంద శాతం వసూళ్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఆర్డీవో రాజు, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మేనేజర్ రాంమోహన్‌రాయి, ఈఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని గ్రంథాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి బుధవారం సందర్శించారు. గ్రంథాలయంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా శ్రీసాయి మానసిక వికలాంగుల పాఠశాలను పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో చిరు దుకాణాల సముదాయాల నిర్మాణం కోసం స్థలాన్ని చూశారు. ఇక్కడ దుకాణ సముదాయాలు నిర్మించడం వల్ల ఏమైన ఇబ్బందులు తలెత్తుతాయా అని తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కమిషనర్ బి శ్రీనివాస్, ఆర్డీవో రాజిరెడ్డి, ఎమ్మార్వో రజని, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి రైల్వే ఉద్యోగి మృతి

జమ్మికుంట, ఫిబ్రవరి 7: జమ్మికుంట రైల్వేస్టేషన్ సమీపంలో ఓ రైల్వే ఉద్యోగి బుధవారం ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృత్యువాత పడ్డాడు. కాజీపేటకు చెందిన మోడం పరమేశ్వర్ (56) జమ్మికుంట రైల్వేస్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నారు. జమ్మికుంట రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. స్టేషన్ దగ్గరలో రైలు కింద పడి మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ కెంసరం సంపత్ తెలిపారు.

చేపల కోసం రెండు గ్రామాల మధ్య ఘర్షణ

శంకరపట్నం, ఫిబ్రవరి 7: శంకరపట్నం మండలంలోని కరీంపేట గ్రామ శివారులో గల ఊర చెరువులో చేపలు పట్టుకునేందుకు బుధవారం కేశవపట్నం గ్రామానికి చెందిన మత్స్యకారులు వెళ్లగా కరీంపేట గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో రెండు గ్రామాల మత్స్యకారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మత్స్యశాఖ అధికారులు జోక్యం చేసుకొని సమస్య పరిష్కరించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు : డేఏవో

గంగాధర, ఫిబ్రవరి 7: ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని డీఏవో పద్మావతి హెచ్చరించారు. బుధవారం గంగాధర మండలంలోని కురిక్యాల పీఏసీఎస్, మధురానగర్‌లోని డీసీఎంఎస్ దుఖానాలను తనిఖీ చేశారు. సూక్ష్మపోషక ఎరువుల తయారీ, ప్రాధాన్యతపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు.ఈసందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు ఇవ్వని దుఖానాలకు సేల్స్ నిలివేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ అంజనీ, ఏవో రాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

జమ్మికుంట, ఫిబ్రవరి 7: పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి గూగులోతు రెడ్డి అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఖరీద్‌దారులు, అడ్తీదారులు, గుమాస్తాలు, హమాలీ, దడ్వాయి, కార్మికులు పాల్గొన్నారు.

నవోదయలో విద్యా నైపుణ్యాలపై అవగాహన

చొప్పదండి, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని నవోదయ విద్యాలయంలో బుధవారం విద్యా నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా చొప్పదండి, ఆర్నకొండ జడ్పీ స్కూల్ విద్యార్థులను విద్యాలయంలోని సైన్స్ లాబోరేటరీలలో ఏర్పాటు చేసిన ప్రదర్శనపై అవగాహన కల్పించారు. గ్రామీణ పాఠశాలల పిల్లలకు సైన్స్ లాబోరేటరీలపై, విద్యా నైపుణ్యాలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ మంగతాయరు తెలిపారు.

గొర్రెలు వస్తాయా?

- డీడీలు కట్టి ఆరు నెలలుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

సైదాపూర్, ఫిబ్రవరి 26: రెండో విడత గొర్రెల కోసం డీడీలు కట్టినవారు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం గొర్రెల యూనిట్ విలువ 1,75,000 రూపాయలుగా నిర్ణయించింది. ఇందులో లబ్ధిదారులు తమ వాటా కింద 43,750 రూపాయల డీడీ తీయాలని అధికారులు తెలిపారు. దీంతో లబ్ధిదారులు డీడీలు తీశారు. అప్పుడు కొంతమందికి మాత్రమే గొర్రెలు పంపిణీ చేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ నిలిచిపోయింది. అనంతరం ప్రభుత్వం మారింది. కొత్త ప్రభుత్వం గొర్రెల పంపిణీపై ఎటువంటి ప్రకటన చేయలేదు. దీంతో డీడీలు తీసిన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. సైదాపూర్ మండలంలో 365 మంది డీడీలు తీశారు. 84 మందికి మాత్రమే గొర్రెలు ఇచ్చారు. డీడీలు తీసిన 281 మందికి గొర్రెలు అందాల్సి ఉంది. ప్రభుత్వం డీడీలు తీసిన వారందరికీ గొర్రెలు ఇచ్చి ఆదుకోవాలని గొల్ల, కురుమలు కోరుతున్నారు.

అప్పులు తెచ్చి డీడీలు తీశాము



- పెద్ది రాజయ్య, జాగీర్‌పల్లి

గొర్రెలు ఇస్తారని ఆశతో అప్పులు తెచ్చి డీడీలు తీశాము. ఆరు నెలలైనా గొర్రెలివ్వలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదని చెప్తున్నారు. ప్రభుత్వం గొర్రెల పంపిణీపై స్పష్టత ఇవ్వాలి.

రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలి



- వెంగళ రవి, గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడు, ఆరెపల్లి

డీడీలు తీసిన గొల్లకురుమలకు గొర్రెలు రాలేదు. ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాలి. గొర్రెలు వస్తాయనే ఆశతో చాలా మంది లబ్ధిదారులు అప్పు తెచ్చి డీడీలు తీశారు. వారికి న్యాయం చేయాలి.

పర్మిట్‌గదిలో చోరీ

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి7: కరీంనగర్‌లోని మూడో ఠాణా పరిధిలో ఒక వైన్‌షాపునకు చెందిన పర్మిట్ గదిలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు చొరబడి 2,500 రూపాయలు దొంగలించుకుపోయినట్లు పర్మిట్ గది నిర్వాహకుడు మూడో ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

గంజాయి కేసులో నిందితుడి రిమాండ్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 7: కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం వద్ద పోలీసుల తనిఖీలలో పట్టుబడిన కిలో 200 గ్రాముల గంజాయి కేసులో నిందితుడు లక్షెట్టిపేటకు చెందిన శశి కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

కొత్తపల్లి ఎస్ఐపై బదిలీ వేటు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి7: కొత్తపల్లి ఎస్ఐ చంద్రశేఖర్‌పై బదిలీ వేటు పడినట్లు తెలిసింది. ఎస్ఐ చంద్రశేఖర్‌ను వీఆర్‌కు బదిలీ చేసి, ఆయన స్థానంలో టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న సాంబయ్యను బదిలీ చేసినట్లు సమాచారం.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి7: కరీంనగర్‌లోని సాహెత్‌నగర్‌కు చెందిన అమేర్‌బిన్ సుల్తాన్ జాబ్రి(36) బుధవారం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. అమేర్ బిన్ సుల్తాన్ జాబ్రి 6 ఏళ్ల కిందట సౌదీకి వెళ్లి కంప్యూటర్ హార్డ్‌వేర్‌గా పనిచేసేవాడని, అక్కడ మరో నలుగురు స్నేహితులతో కలిసి వ్యాపారం చేయగా నష్టం వాటిల్లిందని మృతుడి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రేకుర్తి జాతరకు టెండర్లు ఖరారు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 7: రేకుర్తి సమ్మక్క, సారలమ్మ జాతరలో భాగంగా వాయిదా పడిన కొబ్బరికాయల అమ్మకాలతో పాటు జాతర ప్రాంగణంలో తడకల పందిర్లు వేయుటకు బుధవారం దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో టెండర్లు నిర్వహించారు. రెండు టెండర్లు ఖరారు కాగా గతం వాటితో కలిపి అన్ని అంశాలకు టెండర్ల ప్రక్రియ పూర్తయినట్లు జాతర అధికారి మారుతి తెలిపారు.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 7: నగరపాలక సంస్థ పరిధిలోని ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని అదనపు కమిషనర్ స్వరూపరాణి బిఎల్‌వోలను ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో బీఎల్‌వోలతో ఓటరు జాబితాపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ కల్చరల్: కుల సంఘాలు ఆత్మగౌరవంతో ఉండేలా సంఘ భవనాలు నిర్మాణం చేస్తున్నట్లు నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. బుధవారం నగరంలోని 14వ డివిజన్‌లో సప్తగిరికాలనీ గంగాపరమేశ్వర ఆలయంలో కార్పొరేటర్ దిండిగాల మహేష్‌తో కలిసి 21 లక్షల నిధులతో ప్రహరీగోడ నిర్మాణం, షటర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.

●కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్ 9వ బెటాలియన్‌కు చెందిన నలుగురు ఎన్‌సీసీ క్యాడెట్లు ఇటీవల నిర్వహించిన రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొని ప్రతిభ చాటారు. ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో ఎం విజయ్‌కుమార్, బి సాగర్, ఎ శ్రీచరణ్, ఎస్‌కే రిజియాన్‌లు పాల్గొన్నారని ఎన్‌సీసీ 9వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ తెలిపారు. క్యాడెట్లను ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న, కేర్‌టేకర్ రజిత, సేయింట్‌జార్జ్ చైర్మెన్ ఫాతిమా రెడ్డి, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ డానియేల్, ఆడమ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జైస్వాల్ అభినందించారు.

●కరీంనగర్ స్పోర్ట్స్: ఢిల్లీలో ఇటీవల జరిగిన గణతంత్ర వేడుకల్లో ఎస్ఆర్ఆర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ మారుపాక కీర్తిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో శాతవాహన కో ఆర్డినేటర్ ఆచార్య మనోహర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

●హుజూరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ హామీ మేరకుదళిత సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే ప్రస్తుత పార్లమెంట్ ముగింపు సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి సిరిపాటి వేణు అన్నారు.

● శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ ఖిల్లా సమీపంలోని పల్లె ప్రకృతి వనం నిర్వహణకు ఇద్దరు గ్రామపంచాయతీ కార్మికులను ఏర్పాటు చేయాలని మోరె గణేష్ ఆధ్వర్యంలో గ్రామస్థులు కోరారు. ఈ సంద ర్భంగా బుధవారం ప్రత్యేకాధికారి, తహసీల్దార్ అనుప మకు వినతిపత్రం అందజేశారు.

● హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.

● హుజూరాబాద్ రూరల్ : మండలంలోని కాట్రపల్లి గ్రామ ప్రత్యేకాధికారి, మండల వ్యవసాయాధికారి సునీల్ కుమార్‌రెడ్డిని బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీటీసీ రావుల అనిత-వెంకట్‌లు ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ అనిత, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఏఎన్ఎం రేణుక పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గూడెపు సారంగపాణి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు.

● ఇల్లందకుంట: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని గ్రామ ప్రత్యేకాధికారి గుర్రం రజిత అన్నారు. బుధవారం బూజూ నూర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పలు తీర్మాణాలు చేశారు.

● వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రిచే ఉచిత వైద్యా శిబిరం నిర్వహించారు.

● మానకొండూర్: నిరుద్యోగ యువతకు బుధవారం మానకొండూర్‌లో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి కే. దేవేందర్‌రావు పలు అంశాలపై యువతకు వివరించారు.

● గంగాధర : ప్రతిమ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీపీ గంగాధర శంకర్‌ను బుధవారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు.

● గన్నేరువరం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు కట్టా రవీంద్రాచారి, ఉపాధ్యాయులు శ్రీలత, శరత్, బాలయ్య, తిరుపతిలను బుధవారం పాఠశాలలో ఎచ్ఎం రామయ్య ఆధ్వర్యంలో సన్మానించారు.

● మానకొండూర్ : మానకొండూర్‌లో బుధవారం రాత్రి 30 టన్నుల రేషన్ బియ్యాన్ని స్థానిక పోలీసులు పట్టుకున్నారు.

● చొప్పదండి: శ్రీవేంకటేశ్వరమణికంఠ ఆలయ అభివృద్ధికి వ్యాపారి పైడ మహేశ్ అర్చన దంపతులు 1,18,116 రూపాయలను విరాళంగా అందజేశారు.

- రుక్మాపూర్‌లో పారిశుధ్య కార్యక్రమంపై తహసీల్దార్, ప్రత్యేకాధికారి నరేందర్ సమీక్ష నిర్వహించారు.

● తిమ్మాపూర్: అల్గునూర్‌లో గల పారమిత వరల్డ్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పారమిత విద్యా సంస్థల చైర్మన్ ప్రసాద్‌రావు, డైరక్టర్లు ప్రసూన, వినోద్ రావు, రష్మిత, రాకేష్, అనూకర్‌రావు, ప్రసాద్, ప్రిన్సిపాల్ శ్రీకర్, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.